అమీన్‌పీర్ దర్గాలో సినీనటుల ప్రార్థనలు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప అమీన్ పేరు దర్గాను లారీ చాప్టర్-1 సినిమా హీరో శ్రీకాంత్ రెడ్డి, హీరోయిన్ చంద్ర షికా పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం దర్గాకు విచ్చేసిన హీరో, హీరోయిన్‌కు దర్గా సంప్రదాయం ప్రకారం నిర్వాహకులు స్వాగతం పలికారు. దర్గా విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. దర్గాను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. లారీ చాప్టర్ 1 సినిమా ఆగస్టు 2న విడుదల కాబోతుందని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న హీరో శ్రీకాంత్‌రెడ్డి

జమ్మలమడుగు అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

- గండికోటకు భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు
- కలెక్టర్ లోతేటి శివశంకర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు తాలూకాను అభివృద్ధి చేయడానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం ఎస్‌పితో హర్షవర్ధన్‌రాజుతో కలిసి ఆర్‌డిఒ కార్యాలయంలోని సభాభవనంలో డివిజన్ పరిధిలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఒక జమ్మలమడుగు పైనే కాక జిల్లా మొత్తంపై అవగాహన కల్పించారన్నారు. ప్రతి ఒక్కరూ మారాలని ఎమ్మెల్యే సూచించారన్నారు. జవాబుదారితనంతో పనిచేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. గండికోట పర్యాటకంగా భవిష్యత్తులో అంతర్జాతీయంగా ఆకట్టుకుంటుందన్నారు. స్టీల్ ప్లాంట్ పై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సమీక్ష నిర్వహించారన్నారు. జిల్లాలో ఉచిత ఇసుక విధానంపై 11 డిపోలున్నాయని, జమ్మలమడుగు డివిజన్‌లో గండికోట ప్రాజెక్టు వద్ద ప్రస్తుతం ఉచిత ఇసుక ఉందన్నారు. పది రోజుల్లో జమ్మలమడుగులో కూడా ఉచిత ఇసుక పాయింటును ఏర్పాటు చేస్తామన్నారు. రెండు లక్షల టన్నుల మేరకు ఇసుక అందుబాటులో ఉందన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి నియోజకవర్గంలోని తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.2.50 కోట్ల నిధులను అడగగా వెంటనే మంజూరు చేశామని చెప్పారు. గూడెం చెరువులో 19 ఎకరాలు భూమిని గుర్తించామని, డంప్ యార్డ్ కోసం భూమిని బదిలీ చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ కోరగా కలెక్టర్ స్పందించి భవిష్యత్తులో భూమి సమస్య లేకుండా ఉండాలంటే 19 ఎకరాలు కాకుండా ఎంత అవసరం అయితే అంత భూమిని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరా పైపులు పాతపడిపోయాయని, అందుకు రూ. 80 లక్షల నిధులు మంజూరు కావాలని, డ్రెయినేజీకి రూ.34 లక్షలు, ఎస్‌టి, బిసి నిధులు మంజూరు చేయాలని కమిషనర్ అడిగారు. అలాగే ఎర్రగుంట్ల మున్సిపాలిటీ కమిషనర్ డంపు యార్డు కోసం స్థలాన్ని ఇవ్వాలని, అలాగే వాటర్ సప్లై కి రూ.70 లక్షలు నిధులు కావాలని కోరారు. కలెక్టర్ స్పందించి త్వరలోనే మున్సిపాలిటీ పరిధిలోని కమిషనర్లతో ప్రతి మంగళ వారమూ వర్క్ షాప్ నిర్వహించి మున్సిపాలిటీల్ల అభివృద్ధికి పాటుపడు తామన్నారు. హాస్టల్ వార్డెన్లు మాట్లాడుతూ హాస్టళ్లలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే కలెక్టర్ స్పందించి ఆగస్టు 15 నాటికల్లా హాస్టల్లోని సమస్యలన్నిటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుం టామన్నారు. పంచాయతీరాజ్ ఇఇ మాట్లాడుతూ గ్రామాలలో రోడ్లు పెండింగ్ లో ఉన్నాయి, కొండాపురం మండలంలోని ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లలో రూ.39 కోట్ల పనులు జరగాల్సి ఉందని తెలిపారు. త్వరలోనే అన్ని శాఖల అధికారులతో మరోసారి సమీక్ష నిర్వహిస్తానని కలెక్టర్ తెలిపారు. అనంతరం ముద్దనూరు రోడ్డులోని ఫైర్ స్టేషన్‌ను, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని బయట నుంచి పరిశీలించి వెళ్లారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఆర్‌డిఒ శ్రీనివాసులు, రెవెన్యూ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

దేశంలో మతతత్వ పార్టీల పట్టు సడలింది

పాలకుల మాటలకు, చేతలకు పొంతన లేదు
సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్

ప్రజాశక్తి - బద్వేలు

మతతత్వ రాజకీయ పార్టీల పట్టు సడలిందని, పాలకుల మాటలకు చేతలకు పొంతన ఉండడం లేదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ ఎం.ఎ. గఫూర్ పేర్కొనా్రను. ఆదివారం పట్టణంలోని శ్రీనివాస కళ్యాణం మండపంలో భారత కమ్యూనిస్టు పార్టీ(మార్కిస్ట్) సిపిఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి. చంద్రశేఖర్ విచ్చేశారు. కార్యక్రమంలో ముందుగా ఐ.ఎన్. సుబ్బమ్మ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కమిటీల ప్రతిపాదన, సంతాప తీర్మానం నిర్వహించారు. దేశ వర్ధమాన పరిస్థితులపై కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ మాట్లాడుతూ బిజెపి ప్రచారంలో ఈసారి 400 సీట్లను గెల్చబోతున్నామని అంటూ బిజెపి చాలా బడాయి మాటలతో ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టిందన్నారు. పార్టీ కన్నా మోడీ వ్యక్తిగత ప్రతిష్టను అడ్డం పెట్టుకొని గెలుపు పందెం వేశారని పేర్కొన్నారు. మొదట రెండు దశల పోలింగ్ సరళిని గమనించాక బిజెపి వికసితభారత్ కొత్త నినాదాన్ని తెర మీదికి తెచ్చిందని మూడవ దఫా కేంద్రంలో అధికారంలోకి వచ్చినా బిజెపి పట్టు సడలిందని, మిత్రపక్షాలైన బాబు, నితీష్ ల పైన ఆధారపడి అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. బిజెపి మోడీ పొలిటికల్ గ్రాఫ్ క్రమంగా తగ్గి బలహీనపడుతోందని అనడానికి అయోధ్యలో బిజెపి ఓడిపోవడం, వారణాసిలో బిజెపి మెజార్టీ తగ్గడమే రుజువన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం 154 నుండి కేవలం11 సీట్లకు ఘోర రాజయానికి ప్రజలు పరిమితం చేయటంపై ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. కక్ష సాధింపు రాజకీయాలు, బాబాయి హత్య , చంద్రబాబు అరెస్టు, ల్యాండ్ టైటిల్ యాక్టు, రాజధాని, ప్రభుత్వ అసైన్డ్ భూముల వైసీపీ పెద్దల ఆక్రమణ, మాటలకు, చేతలకు పొంతన లేకుండా పరిపాల సాగించడం వల్లనే వైసీపీ ఘోర పరాజయం పొందిందని చెప్పారు. నేడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) స్కాం దేశంలోని నీట్, జెఇఇ మెయిన్స్ రాసే విద్యార్థులు జీవితాలను ప్రశ్నార్థకం చేశాయి అన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి చంద్రశేఖర్ మాట్లాడుతూ డిఎస్‌సి నోటిఫికేషన్ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25వేల ప్రభుత్వ ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసే విధంగా ఉండాలన్నారు. టెట్‌కు చదువుకోవడానికి సమయం ఉండాలన్నారు. అవకాశవాద తప్పుడు పేదధోరనుల వైపు వెళ్ళకుండా భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్‌ఐ) కృషి చేయాలన్నారు.కడప ఉక్కు ను కేంద్రం పూర్తిగా విస్మరించింది అన్నారు. కడప ఉక్కు శిలాఫలకాలు వేస్తున్నారే తప్ప దాని నిర్మాణానికి చర్యలు చేపట్టడం లేదని, కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి మనోహర్, రామ్మోహన్, సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు కె శ్రీనివాసులు, అన్వేష్, జిల్లాలోని అన్ని ప్రాంతం నుంచి సిపిఎం పార్టీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

- వరుణ్ సాత్విక్ సెంచరీ - భారీ స్కోరు దిశగా కృష్ణా జిల్లా జట్టు

ప్రజాశక్తి - కడప

150 పరుగులు చేసిన వరుణ్‌స్వాతిక్

జిల్లా క్రికెటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్- 19 గ్రూప్ బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో చిత్తూరు, కృష్ణ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. కృష్ణా జట్టుకు చెందిన బ్యాట్స్‌మెన్ వరుణ్ సాత్విక్ సెంచరీ చేయడంతో ఆ జట్టు భారీ స్కోరు దిశగా ముందుకు దూసుకెళుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన కృష్ణా జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 370 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆ జట్టులోని వరుణ్ సాత్విక్ బ్యాటింగ్లో అద్భుతంగా రాణించాడు. 140 పంతులను ఎదుర్కొని 20 బౌండరీలు, 6 సిక్సర్ల సహాయంతో 158 పరుగులు(సెంచరీ)చేశాడు. బి. గీత్ 84(నాటౌట్), ధనుష్ 48 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ 4 వికెట్లు తీసుకున్నాడు. కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో శ్రీకాకుళం, కడప జట్ల మధ్య హోరాహోరీగా సాగుతోంది. తొలుత బ్యాటింగ్ కు దిగిన శ్రీకాకుళం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 63.3 ఓవర్లలో 204 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కె థామస్ రామ్ కుమార్ 104 పరుగులు (సెంచరీ)చేశాడు. పూర్ణ 32 (నాట్ అవుట్) పరుగులు చేశాడు. కడప జట్టులోని పి ధీరజ్ కుమార్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ ఆద్రిత్ రెడ్డి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసిన సమయానికి 26.0 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. ఆ జట్టులోని గురు విగ్నేష్ 59, రోహిత్ 39 (నాటౌట్) పరుగులు చేశారు. కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో విశాఖపట్నం, వెస్ట్ గోదావరి దట్ల మధ్య ఉత్కంఠగా మ్యాచ్ సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన విశాఖపట్నం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 53.0 ఓవర్లలో 171 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కేఎస్. ప్రసాద్ 58, యశ్వంత్ 27 పరుగులు చేశారు. వెస్ట్ గోదావరి జట్టులోని మహబూబ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు, మరో హర్షవర్ధన్ 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 33.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. ఆ జట్టులోని చరణ్ సాయి తేజ 42 పరుగులు చేశాడు. విశాఖపట్నం జట్టులోని పిడి రచిత్ 3,ఎం. యువన్ 3 వికెట్లు తీసుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కడప : ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, కడప హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం వెల్లటూరులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉచిత మెగా వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, ఇఎన్‌టి, డెంటల్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, కంటి సమస్యలకు సంబంధించిన వైద్య సేవలు అందించారు. ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 250 మంది పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హాస్పిటల్ వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల బలోపేతానికి కృషి

- 15 ఫైనాన్స్ నిధులతో అభివృద్ధి పనులు
- స్వమిత్ర పథకంతో ప్రజల ఆస్తుల పరిరక్షణ
- జిల్లా పంచాయతీ అధికారి డి.ప్రభాకర్‌రెడ్డి వెల్లడి



ముఖా ముఖి..

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

పంచాయతీల బలోపేతంపై దృష్టి సారించాం. ఎస్‌డబ్ల్యుపిసి నిధులు మొదలుకుని 15 ఫైనాన్స్ నిధుల వినియోగం, సకాలంలో పన్నుల సేకరణపై దృష్టి సారించాం. ఫలితంగా జిల్లాలోని 557 పంచాయతీల్లో పారిశుధ్యం మొదలుకుని పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించి ప్రజారోగ్యాన్ని పెంపొందిస్తాం. ఉపాధి హామీ నిధుల సహాయంతో పంచాయతీల్లోని గృహాలు మొదలుకుని రహదారులకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలను పెంచడంతో పచ్చదనాన్ని పరుస్తాం. దీంతోపాటు స్వమిత్ర పథకం కింద పంచాయతీల్లో ప్రజల స్థిరాస్తుల గణన ద్వారా శాశ్వత హక్కులు కల్పనకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టామని పేర్కొంటున్న జిల్లా పంచా యతీ అధికారి డి.ప్రభాకర్‌రెడ్డితో ముఖాముఖి...

పంచాయతీల బలోపేతానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

పంచాయతీల అభివృద్ధికి పెద్దపీట వేశాం. ఉపాధి హామీ పనుల సహాయంతో పంచాయతీల పరిధిలోని 2,246 గ్రామాల్లోని ఇళ్లు, రహదారులకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించే ప్రయత్నం జరుగుతోంది. 15 ఫైనాన్స్ నిధుల వినియోగం ద్వారా పారిశుధ్యాన్ని పెంపొందిస్తాం. ఎస్‌డబ్ల్యుపిసి ప్లాంట్ల సహాయంతో సాలిడ్ వేస్ట్ వేనేజ్ వ్యవస్థ ద్వారా చెత్తా చెదారాన్ని సేకరించడం ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ ఖాతాల్లో జమ చేయడం, వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి సరసమైన ధరలకు రైతులకు విక్రయిస్తాం. తద్వారా భూ కాలుష్యాన్ని నియంత్రించే పంటలు వృద్ధి చెందే ప్రయత్నం జరుగుతోంది.

పంచాయతీ వివరాలు తెలపండి?

జిల్లాలో 557 పంచాయతీలున్నాయి. ఇందులో వేంపల్లి, చెన్నూరు, ఖాజీపేట, కొత్తపల్లి, గోపవరం, పోరుమామిళ్ల, రంగసముద్రం, సింహాద్రిపురం మేజర్ పంచాయతీలున్నాయి. జిల్లా పంచాయతీల పరిధిలో 2,246 గ్రామాలున్నాయి. జిల్లాలోని పంచాయతీల నిర్వహణను 427 సచివాలయాల పరిధిలో 527 మంది కార్యదర్శులు పాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు.

పారిశుధ్య నిర్వహణ చర్యలేమిటి?

జిల్లాలో డయేరియా ప్రబలిన నేపథ్యంలో పారిశుధ్య పనులపై దృష్టి సారించాం. ఈనెల 25 నుంచి ఆగష్టు 10 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. జిల్లాలోని ఖాజీపేట, మిడుతూరు ప్రాంతాల్లో ఇటీవల డయేరియా ప్రబలిన నేపథ్యంలో ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్, క్లోరినేషన్ వంటి పనులు చేపట్టడంపై దృష్టి సారించాం. జిల్లాలోని 557 పంచాయతీల పరి ధిలోని 2,246 గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు 626 పారిశుధ్య నిర్వ హణ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 525 పారిశుధ్య కేంద్రాల్లో 1301 క్లాప్ మిత్రలు, 1304 ట్రైసైకిళ్ల సహాయంతో పారిశుధ్య చర్యలు చేపట్టడం జరిగింది.

ఎల్‌డబ్ల్యుఎం కార్యకలాపాల గురించి చెప్పండి?

లిక్విడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఎల్‌డ బ్ల్యుఎం)లో భాగంగా పంచాయ తీల్లోని నీటి వృథాను అరికట్టడం, డ్రెయినేజీ క్లీనింగ్, డ్రెయినేజీ బ్లాకింగ్, వాటర్ స్టాగ్నేషన్ ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయడం ద్వారా దోమల వ్యాప్తిని నిరోధించడం వంటి చర్యలు తీసుకుంటున్నాం.

స్వచ్ఛసంకల్పాన్ని వివరించండి?

స్వచ్ఛ సంకల్పంలో భాగంగా డైలీ క్లాప్ మిత్రలు ఇంటింటికీ తిరిగి తడిపొడి చెత్తలను వేరు చేసి పొడి చెత్తలోని గాజుముక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూపంలో సంపదను సృష్టించే ప్రయత్నం జరుగుతోంది. ఎస్‌డబ్ల్యుపీసీ ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తాం. కొన్ని మేజర్ పంచాయతీల్లో వచ్చే అధిక ఆదాయాన్ని క్లాప్ మిత్రలకు వేతన రూపంలో సర్దుబాటు చేయడానికి అవకాశం ఉంటోంది.

ఓడిఎఫ్ ప్లస్ అంటే ఏమిటి?

ఓడిఎఫ్ ప్లస్ అంటే ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ అని అర్థం. జిల్లాలోని 557 పంచాయతీల వారీగా అమలుకు గట్టి కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులకు ఇరువైపులా మలవిసర్జన నివారణకు కృషి జరుగుతోంది. తక్కువ సమయంలో ఇటువంటి వ్యర్థాల నివారణపై అవగాహన కల్పించే కృషి ఊపందుకుంది.

స్వమిత్ర పథకం తీరుతెన్నుల గురించి తెలపండి?

స్వమిత్ర పథకం కింద పంచాయతీల పరిధిలోని ఆయా రెవెన్యూ గ్రామాల ప్రజలకు సంబంధించిన స్థిరాస్తుల వాణిజ్యీకరణ ఊపందుకుంది. సంబధిత పథకం కింద ఆయా గ్రామాల్లో డ్రోన్ సర్వే ద్వారా ప్రజల ఆస్తులను గణిస్తారు. అనంతరం సంబంధిత ఆస్తులకు మార్కెట్ విలువను జోడించడం జరుగుతుంది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం, ప్రజల ఆస్తులకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పన ద్వారా భద్రత కల్పిస్తాం.

స్వమిత్ర పథకం సర్వే ఎలా సాగుతోంది?

స్వమిత్ర సర్వే ఆశాజనకంగా సాగుతోంది. జిల్లాలోని 731 రెవెన్యూ గ్రామాల పరిధిలో 625 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే చేపట్టనున్నాం. ఇందులోభాగంగా 188 గ్రామాల్లో మ్యాపు-1 పిపిఎంఎస్‌ను తీయడమైంది. ఇందులో 113 ఇళ్లు, ఇళ్ల స్థలాలను గుర్తించడమైంది. ఇందులో 147 మ్యాప్-2 పిపిఎంఎస్ తీయడమైంది. ఇందులో 114 భూ ఆధారిత గుర్తింపు ప్రక్రియల్ని పూర్తి చేయడమైంది.17 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే ద్వారా పూర్తి స్థాయి సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో 72 గ్రామాల్లో ఆస్తుల డ్రాఫ్ట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడమైంది.

ప్రపంచీకరణ విధానాల వల్లే అప్పులు

- హామీల అమలు కోసం పోరాడాలి
- 2025లో ప్రపంచం ఆర్థిక సంక్షోభం ఎదుర్కోబోతుంది
- రాష్ట్ర విద్యా సదస్సులో ఆర్థిక విశ్లేషకులు వి.రాంభూపాల్

సదస్సులో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రపంచీకరణ విధానాల వల్లే అప్పులు పెరిగిపోతున్నాయని ఆర్థిక విశ్లేషకులు వి. రాంభూపాల్ అన్నారు. ఆదివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎస్.వి. ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర విద్యా సదస్సు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి .లక్ష్మి రాజా అధ్యక్షత నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక శ్వేత పత్రం - వాస్తవాలు' అనే అంశంపై రాంభూపాల్ ప్రసంగించారు. టిడిపి కూటమి విడుదల చేసిన ఆర్థిక శ్వేత పత్రం వాస్తవాలకు విరుద్ధంగా ఉందని విమర్శించారు. 2014 -24 మధ్యకాలంలో అప్పులు ఎందుకు పెరిగాయి దానికి కారణమైన కేంద్రంలోని బిజెపి గురించి చెప్పకపోవడం తీవ్ర తప్పిదమని పేర్కొన్నారు. 2014-15 రాష్ట్ర విభజన నాటికి ఆంధ్రప్రదేశ్ జనాభా 58 శాతం అయితే ఆదాయం మాత్రం 46 శాతం వచ్చిందని తెలిపారు. తెలంగాణ జనాభా 42 శాతం ఆదాయం 54శాతం ఇచ్చి ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేశారని శ్వేత పత్రంలో పేర్కొన్నారని చెప్పారు. విభజన సందర్భంగా ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం, రాజధానికి నిధులు ఇవ్వని కేంద్ర ప్రభుత్వాన్ని ఈ శ్వేత పత్రంలో దోషిగా చూపించకపోవడం సిగ్గుచేటన్నారు. 2014-19 లో అద్భుతమైన అభివృద్ధి జరిగినట్లు శ్వేత పత్రంలో చెప్పారని, రాజధాని, పోలవరం, వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ ఇవ్వకుండా ఎలా అభివృద్ధి చెందిందో చెప్పాలని ప్రశ్నించారు. ఇంత అభివృద్ధి చేస్తే 2019లో టిడిపి ఎందుకు ఓడిపోయిందో శ్వేత పత్రంలో చెప్పలేదని ఎద్దేవా చేశారు. అప్పులలో కూరుకు పోవడానికి ప్రధాన కారణమైన ప్రపంచీకరణ విధానాలు, రాష్ట్ర విభజన నాటికి హామీలను అమలు చేయాలని బిజెపి వైఖరి గురించి టిడిపి, వైసిపి మాట్లాడకపోవడం దారుణం అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్ చెప్పినా ఒక్క రూపాయి కేటాయించలేదని విమర్శించారు. రాజధానికి రూ 15 వేల కోట్లు బడ్జెట్‌లోకేటాయించలేదని, వివిధ సంస్థల ద్వారా ఇప్పిస్తామని మాత్రమే చెప్పారని ప్రజలు గమనించాలన్నారు. ప్రపంచ బ్యాంకు విధానాలను తిప్పి కొట్టడానికి యుటిఎఫ్ లాంటి సంఘాలు, కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్. ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్‌లో 46 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారని తెలిపారు. తన పథకాల వల్లే విద్యార్థులు పెరిగారని గత ప్రభుత్వం గొప్పలు చెప్పిందని గుర్తు చేశారు. వాస్తవానికి 35 లక్షల 50 వేల మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ఈ రెండు నెలల కాలంలో రెండు లక్షల లోపు మాత్రమే పిల్లలు చేరారని చెప్పారు. ప్రతి ఏటా మూడు లక్షల మంది పిల్లలు తగ్గిపోతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ఒక్కొక్కరు ఒక్కొక్క కారణం చెప్పినా ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల విలీనం నష్టదాయకంగా మారాయని చెప్పారు. పిల్లలకు అర్థమయ్యే విధంగా బోధన ప్రయోగాలు ఉండాలని పేర్కొన్నారు. జీవో నంబర్ 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను కాపాడుకోవడం కోసం యుటిఎఫ్ ఇచ్చిన కార్యాచరణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హక్కులు బాధ్యతలు సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.విజయ్ కుమార్ పి. మహేష్ బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్. జాబీర్, హరి ప్రసాద్, అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవింద రాజులు, లింగమయ్య, సత్యసాయి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయ చంద్రారెడ్డి, సుధాకర్, నాయకులు, కార్యకర్తలు,పాల్గొన్నారు.

అకడమిక్ కేలండర్ ప్రకటించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి -కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

రాష్ట్ర ప్రభుత్వం అకడమిక్ కేలండర్‌ను ప్రకటించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్. ప్రసాద్ కోరారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో పరీక్షలు రాసేవారని పేర్కొన్నారు. వైసిపి హయాంలో ఇంగ్లీష్ మీడియంలోనే పరీక్ష రాయాలని చెప్పిందన్నారు. దీనిపై టిడిపి కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియాని సమానంగా నడపాలని చెప్పారు. యు డైస్ లెక్కల ప్రకారం 39 లక్షల మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. చదువుతున్నవారు 32.70 లక్షల మంది ఉన్నారని పేర్కొన్నారు. ఆరు లక్షల మంది తగ్గిపోయారని తెలిపారు. అమ్మకు వందనం పేరుతో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ. 15000 ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో గుర్తింపు ఉన్న లేకపోయినా ప్రయివేట్ పాఠశాలలకు చాలామంది విద్యార్థులు వెళ్లిపోయారని చెప్పారు. సిబిఎస్‌ఇ చదువుతున్న విద్యార్థుల్లో గందరగోళం నెలకొని ఉందని పేర్కొన్నారు. జీవో నంబర్ 117 రద్దుచేసి, ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలని కోరారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులపై భారం పెరిగిందని తెలిపారు. హిందీ రాయాలంటే కఠినంగా ఉందని చెప్పారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించి భారం తగ్గించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పాఠశాలలు తెరిచి 43 రోజులవుతుందని శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను అక్కడికి ఇక్కడికి తిప్పడంతో విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. కో- ఆర్డినేషన్ కమిటీ పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి, పర్యవేక్షణ పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం కలిగేలా చూడాలని కోరారు. యుటిఎఫ్ ప్రభుత్వ పాఠశాలలను కాపాడేందుకు, విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు కృషి చేయాలని చెప్పారు. పాఠశాలల పరిరక్షణ వైపు ప్రభుత్వం ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. విజయ్ కుమార్, పి.మహేష్ బాబు, సహాధ్యక్షులు వై.రవికుమార్, కౌన్సిల్ మెంబర్ రాము పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, నాయకులు

బహుముఖ ప్రజ్ఞాశాలి 'కేతు'

- 'కేతు స్మృతి సంచిక' ఆవిష్కరణలో మధురాంతకం నరేంద్ర

ప్రజాశక్తి -కడప అర్బన్

కథకుడిగా, విమర్శకుడిగా, సంపాదకుడిగా, విద్యావేత్తగా కేతు విశ్వనాథరెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రసిద్ధ కథా నవలా రచయిత మధురాంతకం నరేంద్ర అన్నారు. ఆదివారం సి.పి.బ్రౌన్ పరిశోధనా కేంద్రంలో కేతు స్మృతి సంచిక ఆవిష్కరించారు. కథారచయిత దాదాహయాత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అరసం జాతీయ అధ్యక్షులు పెనుకొండ లక్ష్మినారాయణ 'కతు స్మృతి సంచిక 'కేతు... తలపులలో!' ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధురాంతకం మాట్లాడుతూ రాయలసీమ ప్రాతినిధ్య కథకుడిగా ఈ ప్రాంతపు ఆర్థిక, సాంఘిక, సంక్లిష్టతలను, సంక్షోభాలనం, వాటి మాటున దాగిన మానవీయ కోణాలను ప్రతిభావంతంగా చిత్రీకరించిన కథకు నిలువెత్తు రూపం కేతు అన్నారు. మరో కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ మాట్లాడుతూ కేతు రాసిన కథల్లో రాయలసీమ కరువు, స్త్రీ పక్షపాతమూ ఉంటుందని కథలను ఉదహరించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ తాను కథలు రాసిన తొలినాళ్లలో తన కథల్లో విధి పాత్రను తగ్గించుకోవాలని మంచి సూచన చేశారన్నారు. కథారచయిత సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కేతు, సింగమనేని తన కథారచనకు ముందు వెనుక ఉండి నడిపించారని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ చరిత్ర అధ్యాపకులు వై.ప్రభాకరరెడ్డి, అరసం జిల్లా అధ్యక్షుడు ఎన్.ఈశ్వరరెడ్డి ప్రసంగించారు. కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్ నిర్వహించిన కార్యక్రమంలో సాహితీవేత్తలు సంజీవమ్మ, టక్కోలు మాచిరెడ్డి, సుంకోజి దేవేంద్ర, కేతు విశ్వనాథరెడ్డి కుమార్తె శిరీష పాల్గొన్నారు.

పెండింగ్ మెస్ బిల్లులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - కడప

పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని పిఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సి.పి. నాగేంద్ర, ఎబిఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షులు జగన్ నాయక్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులు పెండింగ్‌లో ఉన్న మిస్ బిల్లులు విడుదల చేయాలని అన్నారు. ఆదివారం నగరంలోని బాలుర హాస్టల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ గురుకుల వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు గత ఎనిమిది నెలలుగా మెస్ ఛార్జీలు అందలేదన్నారు. నిత్యావసర సరుకులు రోజుకు పెరిగి పోవడంతో నిర్వహణ భారంగా ఉందని పేర్కొన్నారు. మెస్ ఛార్జీలు అందకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులు మంజురు చేయకపోతే పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వరుణ్, కృష్ణ, తేజ పాల్గొన్నారు.

సాధిక్ బాషాను సన్మానిస్తున్న మానవత సభ్యులు

సాధిక్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

పశువైద్యాధికారి సాధిక్ బాషా సేవలు అభినందనీయమని మానవత సేవా సంస్థ శాశ్వత చైర్మన్ చక్రపాణిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో అధ్యక్షుడు శ్రావణ్ అధ్యక్షతన మానవతా సేవా సంస్థకు సంబంధించి మాసాంతర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై తిరుగుతున్న మూగ జీవాలకు చేసిన సేవలపై వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సాధిక్ బాషాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న మూగ జీవాలను బతికించేందుకు మానవతా సంస్థ సహకారంతో డాక్టర్ సాధిక్ బాషా చేసిన వైద్య సేవలు ఎంతో సంతోషాన్నిచ్చాయన్నారు. శ్రావణ మాసం సందర్భంగా గండి క్షేత్రంలో జరిగే ఉత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో కాలినడక వస్తారని, వారికి నీటి సౌకర్యం, అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు సభ్యులు అందరూ కలిసికట్టుగా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మానవతా కో-చైర్మన్ కావలి కృష్ణతేజ, కన్వీనర్ బొజ్జ రంగారెడ్డి, మానవతా అధ్యక్షుడు శ్రావణ్, రీజినల్ చైర్మన్ బాలాజీ, డైరెక్టర్ సభ్యులు బొజ్జ అనిల్‌కుమార్ రెడ్డి, గోసంరక్షణ అధ్యక్షుడు పుల్లగూర గోవర్ధన్ పాల్గొన్నారు.

జనార్దన్‌రెడ్డికి బియ్యం మూట ఇస్తున్న మానవత సభ్యులు

పులివెందుల రూరల్ : ప్రజాసేవలో మానవతా సేవా సంస్థ ముందుంటుందని మెజిస్ట్రేట్ శ్రీనివాసులు, వేణుగోపాల్, జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పెన్షనర్స్ హోంలో మానవతా సేవా సంస్థ ప్రెసిడెంట్ జయరామరాజు అధ్యక్షతన నెలవారీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నామని, మరింత విస్తృతంగా చేపడతామన్నారు. తల్లిదండ్రులేని విద్యార్థికి నాలుగు వేల రూపాయలను ఆర్థికసాయం అందజేశారు. అనంతరం దీనబంధు ఆశ్రమానికి ఒక బస్తా బియ్యం వితరణ చేశారు. కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలోనే ఇసుక దోపిడీ

- టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వ పాలనలోనే ఎక్కువగా ఇసుక దోపిడీ జరిగిందని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. సిఎం చంద్రబాబు, బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డిపై బురద జల్లుతున్నారని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు, పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇసుక తవ్వకాలు టిడిపి నాయకులు చేయలేదన్నారు. వైసిపి పాలనలో ఇసుక దోపిడీని అడ్డుకునేందుకు వెళ్లిన పాత్రికేయులపై కూడా కేసులు పెట్టిన ఘనత ఆ పార్టీ నాయకులకే దక్కుతుందని విమర్శించారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు మహమ్మద్ ఇనాయతుల్లా, మాజీ జిల్లా కార్యదర్శి పివి రమణ, వేమాకుమార్, భాస్కర్, డివి సుబ్బారెడ్డి, దక్కా రమేష్, జబిబుల్లా, శివ, వీరబద్ర, మడక శ్రీనివాసులు, రమణ, గొటూరు మల్లికార్జున పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పాపాఘ్ని నది నుంచి రాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లుపై పోలీసులు, ఎస్ఇబి పోలీసులు ఆదివారం తెల్లవారుజామున దాడులు చేశారు. ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లును పోలీసుస్టేషన్‌కు తరలించారు. గవిమల్లేశ్వర స్వామి ఆలయ సమీపంలో నుంచి అక్రమంగా 5 ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్న విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ చాంద్ బాషా, ఎస్ఇబి సిఐ సరితా దాడులు చేశారు. రెండు ట్రాక్టర్లను డ్రైవర్లు పాపాఘ్ని నదిలోనే వదిలి వెళ్లడంతో పోలీసులు టైర్లుకు గాలి తీశారు. వాహనాలకు ఉన్న బ్యాటరీలను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని సిఐ చాంద్ బాషా హెచ్చరించారు. నిబంధనల ప్రకారం ఇసుక రవాణా చేయాలని కోరారు. పాపాఘ్ని నది నుంచి ఇసుక తవ్వకాలకు అనుమతి లేదన్నారు.

నగలు చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

- 65 తులాల బంగారం, వెండి నగలు స్వాధీనం : డిఎస్‌పి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని బండల ఉత్తన్న వీధిలో జరిగిన దొంగతనం కేసులో నిందితులైన షేక్ జాఫర్ (బాలల), సయ్యద్ సాదక్ అనే ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4,80,000 లక్షల విలువ చేసే దాదాపు 65 తులాల బంగారు, వెండి నగలను స్వాధీనం చేసుకున్నట్లు పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. వేంపల్లె పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేంపల్లెలోని బండల ఉత్తన్న వీధిలో సయ్యద్ నూర్జహాన్ నివాసం ఉన్నట్లు చెప్పారు. నూర్జహాన్ చిన్న కుమారుడు, కోడలు ఇరువురు సౌదియా అరేబియాకు పోతూ బంగారు, వెండి నగలను భద్రపరచమని ఇచ్చారన్నారు. నూర్జహాన్ తన కుమారుడు ఇచ్చిన బంగారు, వెండి నగలను ఇంట్లో బీరువాలో పెట్టి జూన్ 19న కడపలో ఉన్న తన కూతురు ఇంటికి వెళ్లినట్లు చెప్పారు. కడప నుంచి జూలై 26న మధ్యాహ్నం 3గంటలకు ఇంటికి వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి గేటు పగుల గొట్టి, ఇంటిలో ఉన్న బీరువానూ పగులగొట్టి అందులోని బంగారు, వెండి నగలను దొంగలించినట్లు నూర్జహాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఇంటికి బీగాలు వేసి ఉన్న విషయాన్ని బిడ్డాలమిట్టకు చెందిన బెల్దారు పని చేస్తున్న జాఫర్, సయ్యద్ సాదక్ అనే ఇద్దరు గమనించి దొంగతనం చేసి బీరువాలో ఉన్న బంగారు, వెండి నగలను దోచుకెళ్లినట్లు చెప్పారు. బంగారు, వెండి నగలను ఎద్దుల కొండ వద్ద పీడరాతి బండ కింద పెట్టారన్నారు. ఆదివారం ప్రొద్దుటూరుకు వెళ్లి అమ్ముకొని రావాలనే ఉద్దేశంతో సయ్యద్ సాదక్, షేక్ జాఫర్ అనే ఇద్దరు కలిసి దాచిపెట్టిన బంగారు, వెండి నగలను హ్యాండ్ బ్యాగులో పెట్టుకొని వస్తుండగా అలిరెడ్డిపల్లె రహదారిలోని పాపాఘ్ని నది బ్రిడ్జి వద్ద అనుమానంగా ఉన్న ఇద్దరిని పోలీసులు సోదా చేయగా బంగారు, వెండి నగలు బయట పడ్డాయన్నారు. నిందితులను విచారించగా చోరీ విషయం బయటపడిందన్నారు. ఇద్దరిని రిమాండ్‌కు పంపినట్లు డిఎస్‌పి వివరించారు. చోరీ కేసును తొందరగా ఛేదించినందుకు సిఐ చాంద్ బాషాను, కానిస్టేబుళ్లను డిఎస్‌పి అభినందించారు.

స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి నగలను చూపుతున్న డిఎస్‌పి వినోద్‌కుమార్

ఉద్యాన లక్ష్యం నెరవేరేనా..?

ఉద్యాన విస్తరణ పథకం అమలుకు శ్రీకారం-రైతుల ప్రోత్సాహానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రాష్ట్రంలోనే పులివెందుల ప్రాంతంలో ఉత్పత్తయ్యే అరటి, చీనీ కాయలకు మంచి గుర్తింపు ఉంది. గడచిన ప్రభుత్వం ఉద్యానశాఖ పరిధిలోని ఉద్యాన విస్తరణ పథకం పట్ల ఆసక్తి చూపకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ పథకం కింద పండ్ల తోటలైన అరటి, చీనీ, దానిమ్మ, బొప్పాయి వంటి పంటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహం లభించేది. అరటికి సంబంధించి రెండేళ్లకు హెక్టారుకు రూ.40,700, చీనీ రైతులకు హెక్టారుకు రూ.16,004 లభించేది. అదేవిధంగా బాంబు(వెదురు) సాగు చేసే వారికి కూడా ప్రోత్సాహం లభించేది.

ఉద్యాన విస్తరణ పథకం అమలు శ్రీకారం..

రెండేళ్ల నుంచి మండల వ్యాప్తంగా అరటి సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. అయితే అరటి పిలకలు ధరలు పెరగడం, ఎరువులు, కూలీల ఖర్చు పెరగడంతో సాగు పెట్టుబడి గణనీయంగా పెరిగింది. దీంతో రైతులు ఉద్యాన విస్తరణ పథకం కింద కొంతమేర ప్రోత్సాహం లభిస్తే తమకు కొంతైనా ఉపశమనం ఉంటుందని భావించారు. అయితే ప్రభుత్వ ఆ దిశగా చర్యలు చెప్పట్లేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యాన పంటల సాగు ప్రోత్సహించాలనే లక్ష్యంతో మండల స్థాయి నుంచి నూతనంగా సాగు చేసిన పండ్ల తోటల విస్తీర్ణం వివరాలను సేకరించింది.

పథకం అమలైతే ఎంతో మేలు..

ప్రభుత్వం ఉద్యాన విస్తరణ పథకం అమలైతే కొత్త రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పెట్టుబడిలో కొంతమేర రావడం కారణంగా ఖర్చులు తగ్గి ఆదాయం పెరిగే అవకాశం ఉంది. కావున ఈ

సాగులో ఉన్న అరటి

పథకాన్ని త్వరితగతిన అమలు చేయాలి.

- సుదర్శన్‌రెడ్డి, అరటి రైతు, గురజాల

వెయ్యి హెక్టార్లకు ప్రతిపదనలు పంపాం..

ముద్దనూరు ఉద్యాన శాఖ డివిజన్ పరిధిలోని సింహాద్రిపురం, తొండూరు, ముద్దనూరు, కొండాపురం మండలాలకు సంబంధించి 1000 హెక్టార్లు నూతనంగా సాగు చేసినట్లు సమాచారం సేకరించాం. ఆ మేరకు ఉన్నతాధికారులకు వివరించాం. అలాగే (వెదురు), ఇతర ఉద్యాన పంటలు సాగు చేసే వారిని ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం.

- మల్లేశ్వర్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి, ముద్దనూరు

'అన్నదాత సుఖీభవ' అమలు ఎప్పుడో..!

ప్రజాశక్తి - వేంపల్లె

అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చేందుకు అన్నదాత సుఖీభవ పథకం ఒక ప్రధాన కారణమన్నారు. వైసిపి ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ప్రతిఏటా ప్రతి రైతు కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6వేలతో కలుపుకొని 3 విడతలుగా రూ.13,500 ఇచ్చేదని చెప్పారు. టిడిపి కూటమి అన్నదాత సుఖీభవ అని పేరు మార్చి ఏడాదికి రూ.20 వేలు ఆర్థికసాయం చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. చంద్రబాబు మాటలను రైతులు నమ్మి ఓట్లు వేశారని తెలిపారు. అధికారంలోకి వచ్చి 45 రోజులు అయినప్పటికీ అన్నదాత సుఖీభవ పథకంపై అతిగతీ లేదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సగం సీజన్ కూడా అయిపోయిందని తెలిపారు. ఏరువాక పూర్ణిమ దాటిపోయిందన్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు ఆయన వివరించారు. కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు, వరదలకు

ఎన్. తులసిరెడ్డి

రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. నష్టపోయిన రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అన్నదాత సుఖీభవ పథకాన్ని రైతులు, కౌలు రైతులకు అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వం 2020 సెప్టెంబర్ 1న జిఒ 22 జారీ చేసిందని, ఆ ప్రకారం శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించిందని తెలిపారు. ఈ జిఒను అప్పట్లో కాంగ్రెస్, వామపక్షాలు, టిడిపి వ్యతిరేకించాయన్నారు. కూటమి ప్రభుత్వం జిఒ 22ను వెంటనే రద్దు చేయడంతోపాటు శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ మోటర్లుకు బిగించిన మీటర్లను తొలగించాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

కబ్జా కోరల్లో నల్లాయపల్లె రెవెన్యూ పొలం

500 ఎకరాలు ఆక్రమణ-పండ్ల మొక్కలు నాటిన కబ్జాదారులు-చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం

ఆక్రమణలు జరుగుతున్న ప్రదేశం

ప్రజాశక్తి-అట్లూరు

మండలంలోని నల్లాయపల్లె రెవెన్యూ పొలం కబ్జాకు గురైంది. సోమశిల ముంపు వాసులైన కమలకూరు, మన్యంవారిపల్లి పంచాయతీలో ఉన్న గ్రామస్తులకు గతంలో నల్లాయపల్లె రెవెన్యూ పొలంలో భూ పట్టాలు ఇచ్చారు. ఇటీవల ఆర్‌డిఒ చంద్రమోహన్ చొరవతో పట్టా భూములను సమగ్ర భూ సర్వే చేశారు. రెండు రోజుల కిందటే ఐదు సర్వే బృందాలుగా ఏర్పడి సర్వే చేశారు. మిగులు ప్రభుత్వ డికెటి భూములుగా ఉన్న 500 ఎకరాలపై కబ్జాదారులు కన్నేశారు. రెవెన్యూ యంత్రాంగం ఆదివారం సెలవులో ఉంటారని భావించి, బద్వేల్ మండలానికి చెందిన కొందరు కబ్జాదారులు యంత్రాలతో ప్రభుత్వ భూములను చదును చేశారు. వెనువెంటనే పండ్ల మొక్కలను నాటే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే 250 ఎకరాలు వరకు ప్రభుత్వ భూములను కొందరు నాయకుల కబంధ హస్తాలలో ఉంది. ఆదివారం సెలవు కావడంతో అధికారులు ఉండరని ఇదే అదునుగా భావించిన కబ్జాదారులు డోజర్‌తో, ట్రాక్టర్ తోనే గుంతలు తీసి జామాయిల్ చెట్లు నాటారు. కొత్త నల్లాయ పల్లె ప్రభుత్వ భూములు రీ సర్వే పూర్తయిన తరువాత ఆక్రమణదారులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నా సంబంధితాధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని పలువురు వాపోతున్నారు. పేదలకు అందాల్సిన భూములు కబ్జా గురవడాన్ని నిరసిస్తూ ప్రజలు అట్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు.

భూములను ఆన్‌లైన్ చేయాలి

25 ఏళ్ల కిందట సోమశిల ముంపు వాసులకు పట్టాలు మంజూరు చేశారు. అప్పటి నుంచి భూములు సాగు చేసుకుంటున్నాం. ఆన్‌లైన్ చేయడానికి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మిగులు భూములపై ఆక్రమణదారులు కన్నేశారు. చాలా మంది చదును చేసి మొక్కలు నాడుతున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం. భూములు మేము సాగు చేసుకుంటున్నాము ఆన్లైన్లో నమోదు చేసేటందుకు జాప్యం చేస్తున్నారు ఇప్పుడు చాలామంది చదును చేయడము చెట్లు నాటకం చేస్తున్నారు ఈ విషయమై సోమవారం తహసిల్దార్ అట్లూరు వద్ద ధర్నా చేస్తాము

-వెంకటేషు, నల్లాయపల్లె గ్రామస్తుడు

రసవత్తరంగా టార్గెట్ బాల్ పోటీలు

క్రీడాకారులకు మోమెంటో అందజేస్తున్న సిఐ చాంద్ బాషా, టిడిపి నేత జయరామిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆటస్థలంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ క్రీడా పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఆదివారం కడప, సత్యసాయి, అన్నమయ్య, ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల క్రీడాకారులు తలపడ్డారు. ఫైనల్ మ్యాచ్ పోటాపోటీగా జరగడంతో క్రీడాకారుల్లో ఉత్కంఠ నెలకొంది. ఉత్కంఠతగా కొనసాగిన పోటీల్లో కడప జట్టు మొదటి బహుమతి గెలుచుకోగా, రెండవ స్థానంలో సత్యసాయి జిల్లా, మూడవ స్థానంలో అన్నమయ్య జిల్లా నిలిచింది. అలాగే మహిళ జట్టులో ప్రకాశం జిల్లా మొదటి స్థానంలో నిలవగా, రెండవ స్థానంలో కడప, మూడవ స్థానంలో నెల్లూరు జిల్లా నిలిచింది. టార్గెట్ బాల్ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు సిఐ చాంద్ బాషా, టిడిపి నాయకుడు ఎస్వీ జయరామిరెడ్డి, టార్గెట్ బాల్ టోర్నమెంట్ కమిటీ చైర్మన్ నిమ్మకాయల మహమ్మద్ దర్బార్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ చాంద్ బాషా మాట్లాడుతూ క్రీడలు అనేవి మానసిక ప్రశాంతతకు దోహదపడుతాయన్నారు. క్రీడాల్లో ప్రతిభ చూపితే ఉద్యోగ అవకాశాలు కూడా మెండుగా వస్తాయన్నారు. టార్గెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం టార్గెట్ బాల్ అసోసియేషన్ తరుపున సిఐ చాంద్ బాషా, టిడిపి నేత ఎస్వీ జయరామిరెడ్డి, టోర్నమెంట్ కమిటీ చైర్మన్ నిమ్మకాయల మహమ్మద్ దర్బార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సెక్రటరీ చంద్రశేఖర్, టిడిపి నేతలు నిమ్మకాయల షాకీర్, రెడ్డి కిషోర్, సింగారెడ్డి చైతన్య రెడ్డి, రామాంజనేయురెడ్డి, వార్డు మెంబరు వెంకటేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సుంకేసుల సమీప పొలాల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

విద్యుత్ వైర్లు ఇలా.. ప్రాణాలు పోతే ఎలా..!

ప్రజాశక్తి - ఖాజీపేట

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం రోజురోజుకూ మితిమీరిపోతోంది. విద్యుత్ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నా దృష్టి పెట్టడంలేదని వినియోదారులు, రైతులు ఆరోపిస్తున్నారు. సమస్యను విద్యుత్ శాఖ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. సుంకేసుల సమీపంలోని కస్తూరిబా పాఠశాల సమీప పొలాల్లో విద్యుత్ తీగలు కిందకి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ పనులకు వేలాడుతున్న వైర్లు ఆటంకంగా మారాయి. ప్రమాదకరంగా ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిని సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

చియ్యపాడులో గంగమ్మ తల్లి జాతర

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని పెద్దచియ్యపాడు గ్రామంలో గంగమ్మ తల్లి జాతరను ఆదివారం యాదవులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆషాఢమాసంలో నల్లబోయిన కుటుంబ సభ్యులందరూ అమ్మవారి సన్నిధిలో కలుసుకోవాలని, ఆలయ అభివృద్ధికి దోహదపడాలని తీర్మానించారు. కార్యక్రమంలో పాతపాలెం, కొత్తపాలెం, పోట్లదుర్తి, కానపల్లి, మనారంపల్లి గాంధీనగరం గ్రామాల్లోని నల్లబోయిన కుటుంబ సభ్యులు కలిశారు. కార్యక్రమాన్ని నల్లబోయిన గంగరాజు యాదవ్, చిన్న పుల్లన్న యాదవ్, మల్లయ్య యాదవ్, చీపాటయ్య, సభ్యులు నిర్వహించారు.

జాతరలో నల్లబోయిన యాదవ కుటుంబ సభ్యులు

చాపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కామెర్ల వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - చాపాడు

కామెర్ల వ్యాధి పట్ల అప్రమత్తత అవసరమని ఆరోగ్య విస్తరణ అధికారి రాఘవయ్య తెలిపారు. పచ్చకామెర్ల దినోత్సవ సందర్భంగా ఆదివారం చాపాడు గ్రామపరిధిలో వైద్య సిబ్బంది, ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవయ్య మాట్లాడుతూ హెపటైటిస్ బి హెచ్ఐవి, ఎయిడ్స్ కన్నా ప్రమాదమన్నారు. హెపటైటిస్ బి వ్యాధి ఒకరి నుంచి ఒకరికి రక్తమార్పిడి, రక్తం కలుషితం వల్ల వస్తుందని ప్రజలకు వివరించారు. దీని నివారణకు హెపటైటిస్ బి వ్యాక్సిన్ చిన్నపిల్లల్లో పుట్టినరోజు 24 గంటల్లోపు వేయాలన్నారు. అయిదేళ్ల పిల్లలకు రొటీన్ వ్యాక్సినేషన్‌లో భాగంలో వేయాలని సూచించారు. పచ్చ కామెర్లపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆరోగ్య సిబ్బందికి ఆశా కార్యకర్తలకు, ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాబురెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి రమేష్, ఎఎన్ఎం, స్రవంతి, ఆశా కార్యకర్త పెర్సీ, ప్రజలు పాల్గొన్నారు.

కాలేయ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తీసుకోవాలి

వేంపల్లె : కాలేయ వ్యాధి వచ్చిన తర్వాత రోగులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే కాలేయం పూర్తిగా దెబ్బతిని ప్రాణాంతక వ్యాధులు సైతం వ్యాప్తి చెందే అవకాశం ఉందని హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా స్థానిక దళితవాడలో తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్వాతిసాయి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీరంలోని ఇతర భాగాలతో పోలిస్తే దెబ్బతిన్న కణాలను తిరిగి అభివృద్ధి చేసుకోగల సామర్థ్యం ఒక్క కాలేయానికి మాత్రమే ఉందన్నారు. శరీరంలోనే చర్మం తరువాత కాలేయం (లివర్) అతిపెద్ద అవయవమని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ, సిహెచ్ఒ వెంకటరత్నం, ఆరోగ్య సిబ్బంది లక్ష్మిదేవి, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈనెల 31న నిడువెలగల సమీపంలోని పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ తాతాజీ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ ఇంజనీరింగ్ డిప్లమో కోర్సులకు సీట్లు ఉన్నాయన్నారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడ్మిషన్ నిమిత్తం వచ్చే విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని ఆయన సూచించారు.

30న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులోని ధ్రితి ఆసుపత్రి, వివేకానంద హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వివేకానంద క్లాత్ మార్కెట్‌లో శిబిరం ఏర్పాటు చేశామన్నారు. షుగర్, బి.పి., ఒపి కన్సల్టేషన్‌తోపాటు మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు అవసరమైతే ధ్రితి ఆసుపత్రిలో యాంజియోగ్రామ్, గుండెకు స్టంట్ పేస్ మేకర్‌లో ప్రత్యేక రాయితీ ఉంటుందన్నారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్.వెంకట చెంచయ్య, గైనకాలజిస్ట్ డాక్టర్ అనూష వల్లంకొండు, జనరల్ స్పెషలిస్ట్ డాక్టర్ షిరీన్ వైద్యపరీక్షలు చేస్తారన్నారు. వైద్యుల సలహా మేరకు ఇసిజి గుండె పరీక్షలు చేస్తారని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్‌పి

ప్రజాసేవ కోసమే ట్రస్ట్ ఏర్పాటు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా దేవగుడి శంకర్‌రెడ్డి మరియు సుబ్బరామిరెడ్డి ట్రస్ట్ ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ముద్దనూరు రోడ్డులోని రోటరీ క్లబ్‌లో ఆదివారం ట్రస్టు ఆధ్వర్యంలో వైదేహి వైద్యశాల సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిధిలుగా కలెక్టర్ లోతేటి శివంకర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య శిబిరం నిర్వహించడం శుభపరిణామమన్నారు. గుండె, కిడ్నీ, మోకాళ్ల నొప్పి, క్యాన్సర్ తదితర రోగాలకు అనంతపురం జిల్లా నుంచి వైద్య బృందాన్ని రప్పించి సేవ చేయడం గొప్ప పని అన్నారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ ఆస్తులకన్నా ఆరోగ్యం చాలా ముఖ్యమన్నారు. పోలీసులు చట్టానికి లోబడి పనిచేయాలని, తమకు న్యాయం జరిగిందని పేదవారు అనుకొనేలా మా వ్యవస్థ పని తీరు ఉంటుందన్నారు. వివక్షలేని పోలీసింగ్ విధానం జిల్లాలో ఉంటుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఆదికేశవుల నాయుడుకు చెందిన వైదేహి ఆస్పత్రికి చెందిన 16 మంది డాక్టర్స్ వచ్చారన్నారు. ప్రతి నెల రెండవ శనివారం ఉచిత వైద్య శిబిరం ఉంటుందని, నియోజక వర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ అయిదేళ్లు నిరంతరం కొనసాగుతుందన్నారు. రోగులకు మధ్యాహ్నం భోజనం ఎమ్మెల్యే ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఎంపిడిఒ, పోలీస్ అధికారులు, రెవెన్యూ ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రన్న మహిళా మార్ట్ అని పేరు పెట్టాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఉన్న మహిళా మార్ట్‌కు చంద్రన్న మహిళా మార్ట్ అని పేరు పెట్టాలని రాష్ట్ర టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి నల్లగారి భాస్కర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళా మార్ట్‌కు గత వైసిపి ప్రభుత్వంలో జగనన్న మహిళ మార్ట్ అని అధికారులు పేరు పెట్టారని తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పేరును తొలగించి చంద్రన్న మహిళ మార్ట్ అని ఎందుకు పెట్టలేదని ఆయన అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే బోర్డుపై పేరు మార్చాలని ఆయన డిమాండ్ చేశారు.



నల్లగారి భాస్కర్‌రెడ్డి

రేపు ముద్దనూరు మండల సమావేశం

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మండల ప్రజా పరిష్యత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ చంద్ర మౌళీశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయం, గృహాలు, రోడ్లు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు, కార్యదర్శులు తమ నివేదికలతో రావాలన్నారు. సర్పంచులు, ఎంపిటిసిలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు. ప్రజాప్రతినిధుల తరపున వేరేవారు వస్తే అనుమతించబోమని ఎంపిడిఒ సూచించారు.